తెలుగు డిజిటల్ న్యూస్
సిరి
...People Voice
విలేకరులు కావలెను
మొదటి సారిగా ఉమ్మడి మెదక్ జిల్లా కోసమే ప్రారంభమై ప్రాంతీయ వార్తలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న
సిరి దిన పత్రిక మరియు చానెల్ కు జిల్లా, నియోజకవర్గ మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను.
ఎటువంటి యాడ్స్ టార్గెట్ ఉండదు నెల నెల డబ్బులు కట్టాల్సిన అవసరం లేదు.
కేవలం నిర్భయంగా, నిర్మోహమాటంగా అవినీతి, అభివృద్ధి పై ప్రజా కోణంలో ధైర్యంగా
వార్తలు రాయగలిగే విలేకరులు కావలెను.
సిరి TV ...People Voice
ఫోన్ నెం : 99897 78881, 9697 88 99 22

www.siridaily.com
తెలుగు డిజిటల్ న్యూస్
# సిరి
...People Voice
సోమవారం, డిసెంబర్ 23, 2024 | సంపుటి-1 సంచిక-12 పేజీలు - 4



ప్రజా సేవ చేయడం
## నా అదృష్టం

- పూర్వ విద్యార్థులను కలవడం ఆనందంగా ఉంది
- 12వ గ్రేడ్ తరువాత నేషనల్ డిఫెన్స్ అకాడిమికి..
- ఎన్డీఏలో ఆర్మీకి సెలెక్టర్
- పాకిస్తాన్ చైనా బార్డర్ లో వర్క్ చేశా
- మిగ్ 21, మిగ్ 23 యుద్ధ విమానాల పైలట్ గా దేశానికి సేవలందించా
- మంచోచెడో తెలియదు రాజకీయాల్లోకి వచ్చాను
- పూర్వ విద్యార్థుల రీయూనియన్‌కు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్
- గత స్మృతులను నెమరువేసుకున్న మంత్రి

4

## పటాన్‌చెరులో ఘోర రోడ్డు ప్రమాదం

- ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్
- ఇద్దరు మృతి.. మరొకరికి గాయాలు

3

పేదలకు ఆపన్నహస్తం
## సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- లక్షా 25 వేల ఎల్ఓసీ అందజేత

4



# ప్రజల విశ్వాసానికి ప్రతీక మెదక్ చర్చి

- తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- శతాబ్ధి ఉత్సవాల్లో పాల్గొన్న గవర్నర్
- ప్రత్యేక ప్రార్ధనలు చేసి సత్కరించిన డయాసిస్ సభ్యులు

అనేక జీవితాల్లో మార్పునకు నాంది

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మెదక్ జిల్లా పర్యటన విజయవంతంగా ముగిసింది. ఆదివారం ముందుగా మెదక్ కలెక్టరేట్‌కు చేరుకోగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, ఎంపీ రఘు నందన్‌రావు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుతో కలిసి మెదక్ చర్చిలో శతాబ్ధి ఉత్సవాలలో పాల్గొన్నారు. అక్కడి నుండి కొల్చారం మండల కేంద్రంలోని సాంఘిక గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినీలతో గవర్నర్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతా రెడ్డి, విద్యార్థినీలతో సహపంక్తి భోజనం చేశారు. తొలిసారిగా మెదక్‌కు గవర్నర్ హోదాలో చర్చిని సందర్శించడం పట్ల ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

- మెదక్ ప్రతినిధి, కొల్చారం (సిరిన్యూస్)

వివరాలు 2లో

## దేశ భవిష్యత్తుకు విద్యార్థులే పునాది

- విద్యార్థులు కలలను సాకారం చేసుకునేలా శ్రమించాలి
- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కొల్చారం గురుకుల పాఠశాలలో విద్యార్థినీలతో గవర్నర్ ముఖాముఖీ



## అభివృద్ధికి కేరాఫ్ మెదక్

- అవినీతిలో మునిగి అభివృద్ధిని విస్మరించిన బీఆర్ఎస్
- సీఎం హోదాలో మెదక్‌కు రానున్న రేవంత్‌రెడ్డి
- గెలిచిన ఏడాదిలోనే చర్చి అభివృద్ధికి రూ. 29 కోట్లు తీసుకొచ్చా
- గవర్నర్‌గా మొదటిసారి చర్చిని సందర్శించడం వరం
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు





## జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో దత్త వ్రత క్రతువు

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 22 (సిరి న్యూస్)** సంగారెడ్డి జిల్లా ఫసల్వాది శివారు లోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో దత్తవ్రత క్రతువు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సేవ కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ వ్రత క్రతువులో 215 గ్రామాల నుండి 2400 మంది మహిళా భక్తులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జ్యోతిర్వాస్తు విద్యాపీఠ నిర్వాహకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంతకృష్ణ, ప్రశాంత్ తో పాటు భక్తులు పాల్గొన్నారు.




## విద్యార్థులను అభినందించిన డీఈవో

**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 22(సిరి న్యూస్)** పాఠశాల విద్యాశాఖ మరియు తెలంగాణ గణిత ఫోరం సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పదవ తరగతి ప్రతిభ పోటీ పరీక్షలు హయత్ నగర్ లో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా విద్యార్థులు, గైడ్ టీచర్లుకు, ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు అభినందించారు. పాల్గొన్న విద్యార్థులకు ఎమ్మెల్సీ రఘోతంరెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్, టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కందికొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మిర్జాపూర్ ప్రధానోపాధ్యాయులు రాజ్ కుమార్, సుందర్ రావు చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, టీఎంఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సిద్దేశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి పుణ్య నాయక్, శ్రీనివాస్, రాథోడ్ అభినందించారు.





# ప్రజల విశ్వాసానికి ప్రతీక మెదక్ చర్చి

### అనేక జీవితాల్లో మార్పునకు నాంది

- తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న గవర్నర్
- ప్రత్యేక ప్రార్థనలు చేసి సత్కరించిన డయాసిస్ సభ్యులు

**మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 22(సిరిన్యూస్)** దేవునిపై నమ్మకానికి, ప్రజల విశ్వాసానికి మెదక్ చర్చి ప్రతీకగా నిలుస్తుందని, ఏసుక్రీస్తు బోధనలతో అనేక మంది జీవితాల్లో మార్పుకు నాంది పలికిందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. ఆదివారం మెదక్ జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ ముందుగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ ,అదనపు కలెక్టర్, ఎంపీ రఘునందన్ రావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుండి గవర్నర్ చర్చికి వెళ్ళగా గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత చర్చి ప్రాంగణంలోకి రాగానే మెదక్ ఆర్డీఓ రమాదేవి గవర్నర్కు పూల బోకే అందజేశారు. చర్చి నిర్వాహకులు రెడ్ కార్పెట్ వేసి ఘనమైన స్వాగతం పలికారు. గవర్నర్ క్రీస్తు శిలువ వద్దకు వెళ్లి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం గురువులు గవర్నర్ ను శాలువా, చర్చి నమూనా విగ్రహాన్ని గవర్నర్ కు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ..చర్చి వంద సంవత్సరాల సంబరమే కాదు, విశ్వాసం, తపన, భగవంతుని అమోఘమైన కృపకు నిదర్శనంగా నిలిచే ఒక మహత్తర ఘట్టం అని పేర్కొన్నారు. గత శతాబ్దంగా, మేదక్ కాథెడ్రల్ అనేక మందికి దైవ సాన్నిధ్యానికి కేంద్రంగా నిలిచిందనీ, ఒక విశ్వాసం పెంపొందిన స్థలంగానే కాక అనేకమంది జీవితాలు మార్చిన ప్రదేశంగా నిలిచిందన్నారు. ప్రజలకు ఉపశమనం ఇచ్చి, భవిష్యత్తు తరాల కోసం ఆశల సౌధంగా నిలిచే దేవాలయాన్ని నిర్మించే స్వప్నం చూసారన్నారు. గత శతాబ్దంగా ఈ చర్చి అనేకమందికి విద్య, వైద్యం, ఆధ్యాత్మిక మార్గనిర్దేశనం అందించిందనీ గుర్తు చేశారు. సామాజిక న్యాయానికి బలంగా నిలవడంలో, ఈ ప్రపంచంలో ప్రేమ దీప్తిని వ్యాపింపజేయడంలో మన కృషి కొనసాగించాలనీ పిలుపునిచ్చారు. అనంతరం చర్చి కమిటీ సభ్యులు శాలూవాతో సన్మానించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ రోహిత్ రావు, గవర్నర్ కార్యదర్శి దాన కిషోర్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, ప్రెస్బిరేటరీ ఇంచార్జ్ శాంతయ్య , చర్చి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# అభివృద్ధికి కేరాఫ్ మెదక్

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**మెదక్ ప్రతినిధి, డిసెంబర్ 22(సిరిన్యూస్)** మెదక్ నియోజకవర్గానికి గత పదేండ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో నయాపైసా అభివృద్ధి చెందలేదని... కాంగ్రెస్ ప్రభుత్వం లో ఎమ్మెల్యేగా గెలుపొందిన సంవత్సరంలోపే మెదక్ నియోజకవర్గానికి దాదాపు 200 కోట్ల రూపాయలతో అనేక విధాలుగా అభివృద్ధికి శ్రీకారం చుట్టానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఆదివారం మెదక్ చర్చికి తొలిసారి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మెదక్ జిల్లాకు పూర్వ వైభవం తీసుకురావడానికి నూతన ఒరవడికతో పనిచేసి అన్ని రంగాల్లో ముందంజలో ఉంచుతానని తెలిపారు. మెదక్ చర్చికి గత ఎమ్మెల్యే తీసుకురాని విధంగా తాను రూ.29 కోట్ల 18 లక్షలు ప్రభుత్వం నుండి విడుదల చేయించానన్నారు.

### గవర్నర్ రావడం గొప్ప వరం

చరిత్రలో మెదక్ జిల్లాకు ఉన్న కీర్తిప్రతిష్ఠలను గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం భంగం కల్గించిందని అన్నారు. వందేళ్ళ మహాదేవాలయ ఉత్సవాల్లో భాగంగా మెదక్ చర్చిని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రావడం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం గొప్ప వరం అని అన్నారు. ఇలావుండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రి ని విజ్ఞప్తి చేసిన వెంటనే మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి ఈనెల 25న మెదక్ చర్చి ఉత్సవాల్లో పాల్గొంటారని, అలాగే ఏడుపాయల అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు.

### శతాబ్ది ఉత్సవాలను ఘనంగా చేసుకుందాం...

ఈనెల 25 నాటికి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చికి వందేళ్ళు పూర్తికావడం ఎంతో సంతోషకరంగా ఉందని... ఒక ఆనందకరమైన వాతావరణంలో క్రిస్మస్ వేడుకలతో పాటు వందేళ్ళ మహాదేవాలయ ఉత్సవాలను అందరం కలిసికట్టుగా ఘనంగా నిర్వహించుకుందామని ఎమ్మెల్యే రోహిత్ కోరారు.





# దేశ భవిష్యత్తుకు విద్యార్థులే పునాది

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**కొల్చారం, డిసెంబర్ 22(సిరిన్యూస్)** విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకునేలా నిరంతరం శ్రమించాలని, దేశ భవిష్యత్తుకు విద్యార్థులే పునాదులను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. మెదక్ జిల్లాలో ఆదివారం పర్యటించి కొల్చారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినిలతో ఏర్పాటు చేసిన ముఖాముఖి చర్చా కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను కళాశాల విద్యార్థినులు గౌరవ వందనం తో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విభిన్న సంస్కృతి సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. తదనంతరం విద్యార్థినులు వేసిన పలు ప్రశ్నలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమాధానాలు ఇచ్చారు. దేశ భవిష్యత్తు కు విద్యార్థులే పునాదిలాంటి వారని, సమస్యలను అధిగమిస్తూ లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యాలయాలు దేవాలయాలతో సమానమని, చిన్నతనం నుండే క్రమశిక్షణ తో మెలుగుతూ మంచి నాగరికత పుణికి పుచ్చుకొని భవిష్యత్ కు మార్గ నిర్దేశనం చేసుకోవాలన్నారు. క్రీడలలో బ్యాడ్మెంటిన్ క్రీడ అంటే ఇష్టమని, భారత మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తనకు ఆదర్శమని, నిరంతరం చదవడం, రాయడం పైనే ఆసక్తి చూపుతానని, పుస్తకాలే తన నేస్తమన్నారు. అంతకంటే ఎక్కువగా పిల్లలతో గడపడం మరింత ఇస్తామన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ దేశప్రగతి విద్యార్థుల తరగతి గదుల లోనే అని స్వామి వివేకానంద అన్నట్లు చెబుతూ విద్యను ఇష్టంతో అభ్యసించాలన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల లక్ష్యాలను ప్రశంసించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు భిన్న సంస్కృతులను మేళవిస్తూ ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయన్నారు. పట్టుదల,క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి ఎదగాలని అనుకున్న విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు పునాది లాంటివని, తప్పనిసరిగా అనుకున్న లక్ష్యాలను సాధించ గలుగుతారన్నారు. అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులతో కలిసి గవర్నర్, ఎంపీ, ఎమ్మెల్యే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపుల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రెటరీ అలుగు వర్షిణి అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు.

# ప్రజా సేవ చేయడం నా అదృష్టం

**పూర్వ విద్యార్థుల రీయూనియన్‌కు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్**




**రామచంద్రాపురం, డిసెంబర్ 22 (సిరిన్యూస్)** రామచంద్రాపురం బీహెచ్ఈఎల్‌లోని హైయర్ సెకండరీ స్కూల్ పూర్వ విద్యార్థుల రీయూనియన్‌కు రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఆదివారం స్కూల్ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమానికి పూర్వ విద్యార్థిగా హాజరైన మంత్రి తనతో అప్పట్లో చదువుకున్న వారిని కలుసుకొని సంతోషంగా ముచ్చటించారు. 6 వ తరగతి వరకు బీహెచ్ఈఎల్‌లోని సెయింట్ ఆన్స్ తరువాత టువెల్వ్ గ్రేడ్ వరకు హైయర్ సెకండరీలో ఉత్తమ్ చదువుకున్నారు. 12 వ గ్రేడ్ పూర్తికాక ముందే నేషనల్ డిఫెన్స్ అకాడమీకి వెళ్లి అక్కడే గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో ఎదిగిన అనుభవాలను పంచుకుంటూ ఎన్‌డీఏలో ఆర్మీకి సెలెక్ట్ అయిన తరువాత భారతీయ వాయు సేనాలో పాకిస్తాన్, చైనా బార్డర్‌లో పనిచేశానని చెప్పారు. చాలా ఏళ్లు మిగ్ 21, మిగ్ 23 యుద్ధ విమానాల పైలట్‌గా దేశానికి సేవలు అందిచానని అటు తరువాత ఇండియన్ ప్రెసిడెంట్ వద్దకు డిప్యుటేషన్ విధులపై వచ్చాన్నారు. మంచో చెడో కానీ రాజకీయాలకు వచ్చానని, ప్రస్తుతం ప్రజాప్రతినిధిగా గెలిచి రాజ్యాంగ, ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలకు సేవలందిస్తున్నానని పేర్కొన్నారు. బీహెచ్ఈఎల్ నెహ్రూ స్థాపించిన ఆణిముత్యాలలో ఒకటని మంచి అహ్లాదరకరమైన వాతావరణంలో చదువుకున్నామని తన స్కూల్ డేస్‌ను నెమరువేసుకున్నారు.

# ఘనంగా గాలి అనిల్ కుమార్ జన్మదిన వేడుకలు



**పటాన్‌చెరు, డిసెంబర్ 22(సిరిన్యూస్)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాలి అనిల్ కుమార్ జన్మదిన వేడుకలు పటాన్చెరు నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని మహిమ మినిస్ట్రీస్ అనాథ ఆశ్రమంలో విద్యార్థుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితం ప్రజాసేవకే అంకితమని అన్నారు. అనంతరం అశోక్ నగర్ లోని తన కార్యాలయంలో మెదక్ పార్లమెంటు పరిధిలోని మీద గ్రామాలు పట్టణాల నుండి వచ్చిన వివిధ పార్టీల నాయకులు, మున్నూరు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

# సామాజిక రుగ్మతల నిర్మూలనకు సాంస్కృతిక చైతన్యమే పరిష్కారం

**రచయిత నందిని భగవాన్ రెడ్డి**




**సిద్దిపేట, డిసెంబర్ 22(సిరిన్యూస్)** సాంస్కృతిక చైతన్యం ద్వారానే సామాజిక రుగ్మతల నిర్మూలన జరుగుతుందని రిటైర్డ్ ఉపాధ్యాయులు, రచయిత నందిని భగవాన్ రెడ్డి స్పష్టం చేశారు.. మంజీరా రచయిత ల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన "మంజీర స్వరం" సమావేశం లో ప్రధాన వక్త గా భగవాన్ రెడ్డి మాట్లాడారు.. టీజేఏసీ అధ్యక్షులు జి. పాపయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భగవాన్ రెడ్డి మాట్లాడుతూ అనాదిగా సమాజం లో స్థిరపడిపోయిన కులం,మతం,ప్రాంతం అనే భావనలు అసమానతను, అనైక్యతకు దారి తీస్తున్నదని అన్నారు. అది అంతిమంగా అభివృద్ధి కి ఆటంకంగా పరిణమిస్తున్నదని అన్నారు. ప్రజాస్వామిక దృక్పధం తో, హక్కుల, అసమానతల ప్రాతిపదిక న ప్రారంభం అయిన అస్తిత్వ ఉద్యమాలు కొంతవరకు విజయం సాధించిపటికీ సమాజం లో కుల స్పృహ హద్దులు దాటుతున్నదని అన్నారు. ఫలితం గా తమ కులం గొప్పదంటే.. తమ కులం గొప్పది అనే భావన మరింత పెరుగుతున్నదని అన్నారు. సామాజిక రుగ్మతలు పోవాలంటే దేశం లో సాంస్కృతిక చైతన్యం రావాలని అందుకు కవులు, రచయిత లు, సామాజిక వేత్తలు, విద్యావంతులు, పూనుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ చైర్మన్ జి. పాపయ్య, మంజీరా రచయితల సంఘం అధ్యక్షులు కె.రంగాచారి, ప్రధాన కార్యదర్శి సిద్దంకి యాదగిరి, ఉపాధ్యక్షుడు అలాజ్జూర్ శ్రీనివాస్, తెలంగాణ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యాదగిరి, మరసం కార్యవర్గ సభ్యుడు మచ్చ రాజ శేఖర్ రెడ్డి, ఉపాధ్యాయుడు పద్మారెడ్డి, రాజు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆపన్నహస్తం సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- లక్షా 25 వేల ఎల్ఓసి అందజేత



**పటాన్‌చెరు, డిసెంబర్ 22(సిరిన్యూస్)** ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు పట్టణానికి చెందిన ఠాకూర్ నరేందర్ సింగ్ ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయాడు. ఈ నేపథ్యంలో కృత్రిమ కాలు కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. కృత్రిమ కాలు కోసం మంజూరైన ఒక లక్ష 25 వేల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాన్ని ఆదివారం ఎంఎల్ఏ జిఎంఆర్ నరేందర్ సింగ్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం

**చౌటకూర్, డిసెంబర్ 22(సిరిన్యూస్)** మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామ శివారులో జరుగుతున్న మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. గత మూడు రోజులుగా జరుగుతున్న స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కళ్యాణోత్సవంతో జాతర ఉత్సవం ముగిసింది. బోనాలు, స్వామి వారి కళ్యాణం, అగ్నిగుండాలు, అన్నసంతర్పణ నిర్వహించారు. కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పార్కుల సింధు రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

# మేం చిన్నోళ్లం కాదు.. కొట్లాడి తెలంగాణ తెచ్చినోళ్లం

- టీజేయు రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు





**సంగారెడ్డి టౌన్, డిసెంబర్ 22(సిరిన్యూస్)** తెలంగాణ జర్నలిస్టులు అంటే చిన్నోళ్ళు కాదని కొట్లాడి తెలంగాణ తెచ్చినోళ్లని తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు అన్నారు. జిల్లా అధ్యక్షులు దేవరంపల్లి అశోక్ అధ్యక్షతన జరిగిన సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశంకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ అన్ని పార్టీలతో కలిసి ఉద్యమంలో పాల్గొన్న సంగతి గుర్తు చేశారు. తెలంగాణలో బహుజన బతుకమ్మ ప్రారంభించింది తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ అని గుర్తు చేశారు. పదేళ్ల తెలంగాణలో జర్నలిస్టులు ఎక్కువగా నష్టపోయారన్నారు. సమస్య వచ్చినప్పుడు తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. తెలంగాణలో ఆంధ్ర పత్రికల పెత్తనం ఏందని, ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి తెలంగాణ పత్రికలకు సరైన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి పుట్టినరోజు వేడుకలు రాష్ట్ర అధ్యక్షులు ఘనంగా నిర్వహించారు. ఐఎఫ్ డబ్ల్యూజె జాతీయ ఉపాధ్యక్షులు పెద్దాపురం నరసింహ, రాష్ట్ర కార్యదర్శులు కనకారెడ్డి, బాబురావు, సిద్దిపే ట జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, మెదక్ జిల్లా అధ్యక్షులు పి రామయ్య, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు దిలీప్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రసాద్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కనక య్య, మహిపాల్ రెడ్డి, కార్యదర్శి మలేష్, కార్యవర్గ సభ్యులు గందమల స్వామి, రానోజ్ ప్రదీప్, ఎం. దశరథ్, మహేష్‌గౌడ్, జావేద్ పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి

- ఎంపీ రఘునందన్ రావుకు వినతి

**కొల్చారం, డిసెంబర్ 22(సిరిన్యూస్)** కొల్చారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు గత మూడు నెలల నుండి తమకు వేతనం రావడం లేదని ఆదివారం ఎస్సీ గురుకుల పాఠశాలకు వచ్చిన మెదక్ ఎంపీ రఘునందన్ రావును కలిసి విజ్ఞప్తి చేశారు. వేతనాలు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నామని ఎంపీకి తెలిపారు. త్వరలో పారిశుద్ధ్య కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీనిచ్చారు.




Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.